క్లుప్తంగా

వేగవంతంగా భూముల రీ సర్వే



పొన్నూరు: మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో చేపట్టిన రీ సర్వేలో భాగంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో డీఎల్ఆర్ (డ్రాఫ్ ల్యాండ్ రిజిస్టర్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జియావుల్ హక్ మాట్లాడుతూ.. డీఎల్ఆర్ పనులు నాలుగైదు రోజుల్లో పూర్తవుతాయన్నారు. రీ సర్వే పూర్తి అయితే రైతులకు సంబంధించిన అనేక భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

టైమ్ స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని వినతి



పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులను టైం స్కేల్ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌కు ఈ విషయమై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారులు అప్పగించిన పనులను నిబద్ధతతో చేస్తూ ఏఎన్‌యూ ఉన్నతికి మా వంతు కృషి చేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో సుమారు 22 ఏళ్లుగా దినసరి వేతన ఉద్యోగులుగా పనిచేస్తున్నామని.. తెలుగు అకాడమిలో పనిచేస్తున్న దినసరి వేతన ఉద్యోగులకు టైం స్కేల్ అమలు చేయడానికి హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. దినసరి ఉద్యోగులను టైంస్కేల్ ఉద్యోగులుగా గుర్తించాని కోరారు. ఎమ్మెల్యేని కలిసిన వారిలో గోపాలకృష్ణ, భాను ప్రసాద్ తదితరులు ఉన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



పెదకాకాని: విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించి ప్రయోజకులు కావాలని గురుమాత ఆచార్య కమలరాజు అన్నారు. శ్రీ యోగ విద్యా ప్రాణశక్తి ఫౌండేషన్, లైన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని వెనిగండ్ల గ్రామం బుడగ జంగాల కాలనీ కమ్యూనిటీ హాల్‌లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్‌కేఎస్ శ్రీ యోగ విద్యా ప్రాణశక్తి ఫౌండేషన్ ప్రతినిధులు నోముల శ్రేయ వారి కుటుంబ సభ్యుల సహకారంతో అద్దేపల్లి సతీష్ కుమార్ దాతృత్వంతో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలపాటి నరేష్ గుప్తా, లయన్ జై సూర్య జయశ్రీ, లయన్ వెంకట్, అంబారం వేణుగోపాల్, కోసూరి కుమార్‌రాజా, శివయోగి చింతా శంభునాథ్ పాల్గొన్నారు.

సాంకేతిక విప్లవానికి అనుగుణంగా పాఠ్య ప్రణాళిక రూపకల్పన



పెదకాకాని(ఏఎన్‌యూ): ప్రపంచ వ్యాప్తంగా సాంకేతిక విప్లవం నిత్య నూతనంగా కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత తరుణంలో విద్యార్థుల భవితకు భరోసానిచ్చేలా పాఠ్య ప్రణాళిక రూపకల్పన జరగాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య మధుమూర్తి అన్నారు. 2025–26 విద్యా సంవత్సరం నుంచి కొత్త పాఠ్య ప్రణాళిక ప్రకారం పాఠ్య ప్రణాళిక సవరణ ప్రక్రియకు సంబంధించి ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వేదికగా మూడు రోజుల వర్క్ షాప్(కార్యశాల) శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆచార్య మధుమూర్తి ప్రారంభోపన్యాసం చేశారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి కార్యదర్శి(ఏపీఎస్సీ) టీవీ శ్రీకృష్ణమూర్తి, కోఆర్డినేటర్ డాక్టర్ జి.రోశయ్య, జి.శ్రీరంగం మాధ్యూ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ బాలికల వసతి గృహం సందర్శన

గుంటూరు లీగల్: గుంటూరు మహిళా ప్రాంగణంలోని ఎస్టీ బాలికల వసతి గృహం, కాలేజీ ఎట్ హోమ్‌ను శుక్రవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, గుంటూరు కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ సందర్శించారు. వసతి గృహంలో విద్య, వైద్యం, ఆహారం ఇతర సదుపాయాలు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అన్ని వసతులు అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. క్రమశిక్షణతో చదువుకొని భవిష్యత్‌లో మంచి పౌరులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

కూటమి ప్రభుత్వంపై ప్రజాగ్రహం

- అక్రమాలను ప్రశ్నిస్తే దాడులు
- టీడీపీ కుట్రలను గమనిస్తున్న ప్రజలు
- వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



బ్రాహ్మణకోడూరులో బాబు మోసాలను వివరిస్తున్న అంబటి మురళీకృష్ణ

పొన్నూరు: ఎన్నికల హామీలను నెరవేర్చకుండా మోసం చేసిన కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని జూపూడి, గోళ్లమూడిపాడు, బ్రాహ్మణకోడూరు, వెల్లలూరు గ్రామాల్లో నాయకులతో కలిసి ఆయన పర్యటించారు.

ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, మోసాలను వివరించారు. పథకాలు ఇవ్వని కారణంగా ప్రతి కుటుంబం నష్టపోయిన మొత్తాన్ని ప్రజలకు ఆయన తెలియజేశారు. చంద్రబాబు అమలు చేయని హామీలతో కూడిన మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ కర పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. కూటమి నేతలు చేస్తున్న అన్యాయాలు, అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకూ పోరాటం చేస్తామని ఆయన అన్నారు.

బాబు మోసాలపై నిలదీయాలి..

గ్రామాల్లో అన్ని పార్టీల వారికి జగనన్న పథకాలు అందిస్తే.. కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తూ, అడిగిన వారిని పోలీసులతో బెదిరిస్తున్నారన్నాని అంబటి మురళీకృష్ణ అన్నారు.

బాబు ఇచ్చిన హామీల వల్ల మహిళలు, నిరుద్యోగులు, రైతులు, మోసపోయారని.. గ్రామాల్లోకి టీడీపీ నాయకులు వస్తే బాబు చేసిన మోసంపై నిలదీయాలని సూచించారు. గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇచ్చిన ప్రతి హామీనీ నెరవేర్చారని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు చింతలపూడి మురళీకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆకుల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం అధ్యక్షులు చిర్రా అక్కిరెడ్డి, మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ మౌలాలి, మహిళా విభాగం అధ్యక్షురాలు కూచిపూడి మరియారాణి, ఎస్సీ సెల్ అధ్యక్షులు పానుగుపాటి పాల్ రాజు, ప్రచార విభాగం అధ్యక్షులు తురిమెళ్ల రాజశేఖర్, మండల ఉపాధ్యక్షులు సాపాటి శ్రీధర్, వేల్పూరి వెంకటేశ్వరమ్మ, శివశంకర్, సర్పంచ్ ప్రసాద్, కగ్గా వేమారావు, గోపి, కంకిపాటి ప్రభుదాస్, ఆదాం, మోపర్తి విజయరాజు, నాగబాబు, తిరుపతయ్య, అంగిరేకుల శ్రీనివాసరావు, కూరగంటి సాంబశివరావు, కోఆప్షన్ సభ్యులు పఠాన్ మస్తాన్ షరీఫ్, సత్యం, నాయకులు అమిరినేని సాంబశివరావు, దేవరకొండ గోపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్



కార్యక్రమంలో మాట్లాడుతున్న బలసాని కిరణ్ కుమార్

గార్లపాడు(కాకుమాను): ఏడాదిగా రాష్ట్ర ప్రజలకు చంద్రబాబు చేస్తున్న మోసాలను ఇంటింటికి తెలియజేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని గార్లపాడులో పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మాలపాటి రవి కుమార్ అధ్యక్షతన శుక్రవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కిరణ్ కుమార్ మాట్లాడారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్ అంటూ ప్రజలకు దొంగ వాగ్దానాలు చేసి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత సూపర్ సిక్స్‌ను సూపర్ ప్లాప్ చేశాడని అన్నారు.

అరకొర పథకాలను సగం మందికే ఇచ్చి పచ్చ పత్రికల్లో అన్ని పథకాలను అమలు చేశామని ప్రకటించుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి నాయకుడు, కార్యకర్త ఇంటింటికి వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, మాజీ మండల కన్వీనర్ నల్లమోతు శివరామకృష్ణ, నన్నపనేని కిషోర్ బాబు, ఎస్సీ సెల్ మండల కన్వీనర్ గేరా పున్నారావు, మైనార్టీ కన్వీనర్ పొన్నూరు షేక్ కరిముల్లా, కాకుమాను ఎంపీటీసీ కానుగుల పరమేశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు పెదపూడి కపిల్, తియ్యగూర వెంకటరెడ్డి, మెరిగల రవి, మాజీ ఎంపీటీసీ ముజావర్ షేక్ లతీఫ్ అలీ, కొత్త అమేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు, వల్లూరు గ్రామ సర్పంచ్ వింతా రాఘవరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి పార్టీ నాయకులు సంతాపం తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన



చేబ్రోలు: పొన్నూరు డివిజన్ పరిధిలోని మండల, గ్రామాల పరిధిలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించి ప్రకృతి వ్యవసాయంపైవు రైతులు మక్కువ చూపే విధంగా వీఏఏలు, వీహెచ్ఏలు కృషి చేయాలని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. చేబ్రోలు మండలం వేజండ్ల గ్రామంలో మూడు రోజుల పాటు డివిజన్ పరిధిలోని వీఏఏలు, వీహెచ్ఏలకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రామకోటేశ్వరి మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో బీజామృతం, ద్రవజీవామృతం, ఘన జీవామృతం, నీమాస్త్రం విత్తన గుళికలు తయారు చేసి డెమోను వ్యవసాయ సిబ్బందికి తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏ వీరలక్ష్మి, ఎంటీ శ్యాంబాబు, యూనిట్ ఇన్‌చార్జి అభిలాష్, శ్యామల, ఆదుషా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ సమావేశం నేడు

పెదకాకాని: బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేసేందుకు శనివారం కార్యక్రమాలను ఏర్పాటు చేయనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ ముడియాల మల్లికార్జున రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గోళ్లమూడి గ్రామంలో సాయంత్రం 5:30 గంటలకు, నంబూరు ముస్లింపాలెంలో 6 గంటలకు, విజయ భాస్కర్ నగర్‌లో 6:30 గంటలకు, అంబేడ్కర్ నగర్‌లో రాత్రి 7 గంటలకు కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

సమగ్ర పోషక యాజమాన్యంపై శిక్షణ



తరగతుల్లో పాల్గొన్న విశ్వవిద్యాలయం అధికారులు, శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: నగర శివారు లాంఫాంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో ప్రాథమిక సహకార ప్రతినిధులకు (పీఏసీఎస్) సమగ్ర పోషక యాజమాన్యంపై ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి లాంఫాం ఏడీఆర్ డాక్టర్ ఎస్‌వీవీఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమాన్ని విశ్వవిద్యాలయం, మేనేజ్, సమేతి మంగళగిరి సంయుక్తంగా నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమం ద్వారా పోషక యాజమాన్యంపై నిష్ణాతులైన శాస్త్రవేత్తల ద్వారా తరగతులు నిర్వహించి కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులకు ఎరువుల వినియోగంలో మెళకువలు, జాగ్రత్తలు తెలియజేస్తారని అన్నారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు మాట్లాడుతూ.. ప్రాథమిక సంఘం ప్రతినిధులు శిక్షణ కాలంలో నేర్చుకున్న వ్యవసాయ సమాచారాన్ని రైతులకు అందజేయడంలో పారా విస్తరణ అధికారులుగా విధులు నిర్వహించాలన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివన్నారాయణ మాట్లాడుతూ.. ఖర్చులు తగ్గించుకుంటూ లాభసాటి వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. మంగళగిరి సమేతి సహ వ్యవసాయ సంచాలకులు జేఎస్ఎం పుణ్యవతి మాట్లాడుతూ.. ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏరువాక కేంద్రం, సమన్వయకర్త డాక్టర్ ఎస్.వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. ఆరు జిల్లాలైన ఏఎస్ఆర్ పాడేరు, అనకాపల్లి, గుంటూరు, చిత్తూరు, ఎన్టీఆర్, నెల్లూరు జిల్లాల నుంచి 29 మంది సభ్యులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమం 15 రోజుల పాటు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.వెంకటరాములు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

సంగీతం ప్రాధాన్యతను తెలియజేస్తూ సాగిన ప్రాతిగ్య



కార్యక్రమంలో వేదాంతం రాధేశ్యాం, డాక్టర్ ఎస్పీ భారతి, వీసీ గంగాధరరావు

పెదకాకాని(ఏఎన్‌యూ): సంగీతం ప్రాధాన్యతను తెలియజేస్తూ ప్రాతిగ్య(సంగీత కళా ప్రదర్శన) ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కొనసాగింది. న్యూఢిల్లీకి చెందిన సంగీత నాటక అకాడమి, ఏఎన్‌యూ సంయుక్తంగా శుక్రవారం వర్సిటీలో ప్రాతిగ్య కార్యక్రమాన్ని నిర్వహించాయి. కళాకారులు దీపక్‌జోషి, డాక్టర్ ఎస్పీ భారతి ప్రాతిగ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను మండా సుధారాణి కచేరి చేస్తూ ప్రాతిగ్య కొనసాగించారు. సంగీత కళా ప్రాధాన్యతను వివరిస్తూ అద్భుతమైన ప్రదర్శన చేశారు. కూచిపూడి నృత్య నిపుణులు వేదాంత రాధేశ్యాం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు ప్రశంగించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, పలువురు అధికారులు, కళాకారులు పాల్గొన్నారు. కళాకారులు అద్భుతంగా ప్రదర్శన చేశారు.

పోక్సో కేసు నమోదు

నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన నల్లపాడు పోలీసులు

గుంటూరు రూరల్: 'కంచే చేను మేస్తే కాసేదెవరు' అన్న చందంగా ఉంది నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఘటన. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణభారతీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి స్థానిక అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. అతనికి భార్య.. ఐదుగురు ఆడపిల్లలు ఉన్నారు. తన పెద్ద కుమార్తెను స్థానికంగా కార్ డ్రైవింగ్ చేసే వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించాడు. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. వాచ్‌మెన్‌కు ఐదుగురూ ఆడపిల్లలే అవ్వడంతో పెద్ద అల్లుడిని ఇల్లరికం తెచ్చుకుని కొడుకు లేని లోటును తన అల్లుడులో చూసుకునేవాడు. ఇదిలా ఉండగా.. ఐదుగురిలో చివరి అమ్మాయి(ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న మైనర్)తో అల్లుడు చనువుగా ఉండేవాడు. ఆమెను గత పది నెలల క్రితం ఇంట్లో నుంచి తీసుకుని అల్లుడు పరారయ్యాడు. చిన్న కుమార్తె, అల్లుడు కనిపించకపోవడంతో తండ్రి నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు గురువారం అల్లుడిని అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం అల్లుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను మాయ మాటలతో తీసుకెళ్లినందుకు, తండ్రి ఫిర్యాదు మేరకు అల్లుడిపై పోక్సో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

వివాలో ఐక్యరాజ్యసమితి నమూనా సదస్సు



పెదకాకాని: అంతర్జాతీయ వ్యవహారాలపై అవగాహన నాయకత్వ నైపుణ్యాలు అభివృద్ధి చెందేలా వివా ది స్కూల్ విద్యార్థులు నిర్వహిస్తున్న మోడల్ యునైటెడ్ నేషన్ (ఐక్యరాజ్య సమితి నమూనా) కార్యక్రమ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన మండలి సభ్యులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ హాజరయ్యారు. మండలంలోని నంబూరు వివా ది స్కూల్‌లో శుక్రవారం నిర్వహించిన ఐక్య రాజ్యసమితి నమూనా సదస్సుకు గౌరవఅతిథులుగా రోటరీ ఇంటెల్ డిస్ట్రిక్ట్ పూర్వ గవర్నర్ డాక్టర్ రవి పద్దమాని, వివా చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్ హాజరయ్యారు. మూడు రోజులపాటు నిర్వహించనున్న ఈ సదస్సులో తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ పాఠశాలల నుంచి 360 మంది విద్యార్థులు పాల్గొని ఐక్యరాజ్యసమితిలో భాగమైన ప్రతినిధుల సభ, భద్రతా మండలి, సచివాలయం, అంతర్జాతీయ న్యాయస్థానం, ఆర్థిక సాంఘిక మండలి సభ్యులుగా ఏర్పడి చర్చించనున్నారు. ఈ సందర్భంగా ఐదవ తరగతి విద్యార్థి భట్టు స్వారిక ప్రదర్శించిన శాస్త్రీయనృత్యం అలరించింది. కార్యక్రమంలో డైరెక్టర్ ఎలి కమాండర్ కేఎస్ రావు, ప్రిన్సిపాల్ సీహెచ్ సరళ, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆలోచనలు గొప్పగా ఉండాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థుల ఆలోచనలు గొప్పగా ఉండాలని రవి హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు, న్యూరో సర్జన్ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం రాజాగారితోటలోని నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలకు మైక్, సౌండ్ బాక్సును అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి, భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకుని పది మందికి చేయూత ఇవ్వాలని సూచించారు. ఈసందర్భంగా గత విద్యాసంవత్సరంలో ఐదో తరగతిలో తొలి మూడుస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామనర్సయ్య, న్యాయవాది బొప్పా శ్రీనివాసరావు, వి.మనోజ్, వై.అజయ్, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏఎన్‌యూ అడ్మిషన్‌ల ప్రక్రియ పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న వీసీ ఆచార్య కంచర్ల గంగాధర్

పెదకాకాని(ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ కళాశాలలో సివిల్ మెకానికల్ బ్లాక్‌లో ఈఏపీ సెట్ 2025 అడ్మిషన్‌ల మొదటి విడత గురువారం ప్రారంభమయ్యింది. రెండో రోజు శుక్రవారం అడ్మిషన్‌ల ప్రక్రియను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధర్, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం సందర్శించి అన్ని ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ఇంట్రాక్ట్ అయ్యారు. విద్యార్థులకు తల్లిదండ్రులకు అడ్మిషన్‌ల సందర్భంగా చేసిన అన్ని సదుపాయాలను, ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 70 శాతం మంది విద్యార్థులు రిపోర్ట్ చేయగా.. చివరిరోజు శనివారం కూడా విద్యార్థులు హాజరవుతారని ఆశాభావం వ్యక్తపరిచారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ ఆఫీసర్ డాక్టర్ ఎండీ తౌసిఫ్ అహ్మద్, అన్ని విభాగాల సమన్వయకర్తలు, ఆఫీసు సిబ్బంది, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కంపోస్ట్ యార్డులో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించాలి



బుడంపాడులో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగర పాలక సంస్థ కంపోస్ట్ యార్డ్‌లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు జిందాల్‌కి తరలించాలని.. వాహనాల ట్రిప్‌లు, చెత్త బరువును వేయింగ్ మిషన్ ద్వారా చెక్ చేసి ప్రత్యేక రిజిష్టర్‌లో నమోదు చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏటుకూరురోడ్‌లోని కంపోస్ట్ యార్డ్, బుడంపాడులో పలు అభివృద్ధి పనులను ఆయన పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలో వార్డ్‌ల వారీగా సేకరించే వ్యర్థాలు అధిక శాతం ఏటుకూరు రోడ్ కంపోస్ట్ యార్డ్‌కి వస్తుందని, యార్డ్‌కి వచ్చే ప్రతి వాహనం ట్రిప్‌లు, తెచ్చే చెత్త బరువుని రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. వర్మి కంపోస్ట్ బెడ్స్ పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏఈను ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ సతీష్, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

కళ్ళంలో ప్రారంభమైన డిప్లొమా తరగతులు




కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉమాశంకర్‌రెడ్డి

గుంటూరు రూరల్: నగర శివారు చౌడవరం గ్రామంలోని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం తరగతులను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కళాశాలలో ప్రవేశం పొందిన ప్రతి విద్యార్థికి విద్యా, ఉపాధి కల్పనే ధ్యేయంగా కళాశాలలో విద్యా బోధన ఉంటుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి మాట్లాడుతూ.. డిప్లొమా విద్యార్థులు ప్రస్తుత డిజిటల్ టెక్నాలజీ ప్రపంచంలో సరైన మార్గంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించినట్లయితే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో కళాశాల డిప్లొమా విభాగ డీన్ డాక్టర్ వెంకట్రావు, ఉపాధి కల్పన అధికారి డాక్టర్ పీఎల్ మాధవరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు సన్మానం

నెహ్రూనగర్: ఎస్సీ కమిషన్ చైర్మన్ కొత్తపల్లి శామ్యూల్ జవహర్ సన్మాన కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం నాయకులు మేడిద బాబురావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని ఆంధ్ర క్రిస్టియన్ కళాశాల(ఏసీ కాలేజీ)లో నిర్వహించనున్న సన్మాన కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

● ప్రారంభమైన శ్రావణమాస పూజలు



పెదకాకాని శివాలయంలో శ్రావణమాస పూజలు ప్రారంభమైయ్యాయని ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ శుక్రవారం తెలిపారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణమాస మొదటి శుక్రవారం సందర్భంగా భ్రమరాంబ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ ఉప కమిషనర్ ఏర్పాట్లు చేశారు. అనంతరం శ్రావణమాసంలో జరిగే కార్యక్రమాలను డీసీ వివరించారు.

– పెదకాకాని

ముస్లింల మనోభావాలు దెబ్బతినేలా హరిహర వీరమల్లు చిత్రం

పట్నంబజారు: హరిహర వీరమల్లు సినిమా పేరు తో ముస్లింలపై దుష్ప్రచారం చేస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గులాం రసూల్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ సినిమాలో చరిత్రలో లేనటువంటి పాత్రను కల్పించి ముస్లింలను కించపరిచేలా కథను నడిపించడమంతా ఒక రాజకీయ అజెండాలో భాగమేనని పేర్కొన్నారు. హరిహర వీరమల్లు అనే పాత్రకు చారిత్రక ఆధారాలు లేవని చరిత్రకారులే స్పష్టం చేస్తున్నారని చెప్పారు. అలాంటి కల్పిత పాత్రల చుట్టూ కథలను నిమిరి, ఓ మతాన్ని లక్ష్యంగా చేసుకొని అసత్య ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. ఇది ఒక రకంగా ముస్లింల మనోభావాలను దెబ్బతీసే చర్య అని దీనిని పూర్తిగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఉప ముఖ్యమంత్రి హోదాలో ఉన్న పవన్ కళ్యాణ్ వివాదాస్పద పాత్రల్లో నటించటం నైతికంగా, రాజకీయంగా సరికాదనీ అభిప్రాయపడ్డారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ప్రోత్సహించే కుట్రగా మేము పరిగణిస్తున్నామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని వివిధ మతాల ప్రజలు శాంతిగా, సహజీవన స్ఫూర్తితో ఉంటున్న తరుణంలో ఇలాంటి చిత్రాలు సామాజిక శాంతికి ముప్పుగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు.